# గాలి దుమారం

భక్తవత్సలం అండ్ భాస్కర్



సూరి, హరి, నేను ముగ్గురం మొదటి తరగతి నుండీ క్లాస్‌మేట్సుమి బెంచి మేట్సుమి కూడను. హరి, సూరి ఇద్దరు అన్నదమ్ముల కొడుకులు చదువుకునేందుకు రెండు మైళ్ళ దూరంలో ఉన్న వాళ్ళ ఊరినుండి మా ఊరికి రోజూ నడచివచ్చేవారు. స్కూలు వదిలి పెట్టగానే ఆడుతూ పాడుతూ అందరితో కలిసి వెళ్ళేవారు.

మా ముగ్గుర్లో హరి థర్డ్‌రేట్ స్టూడెంట్, సూరి ఫస్ట్‌క్లాస్ స్టూడెంటు, నేను మామూలే. హరి ఎనిమిదో తరగతికి వచ్చేటప్పటికల్లా పూర్తిగా చెడిపోయాడనటానికి వాడు ఎనిమిదో క్లాసులో తప్పడమే నిదర్శనము. శ్రద్ధగా చదివితే ప్యాసవుతావురా అంటే వినేవాడు కాదు. అప్‌టుడేట్ ఫ్యాషన్స్‌తో షోకిల్లా తిరుగుళ్లు తిరిగేవాడు. వాడి చదువు అంతటితో ఆగిపోయింది. హెచ్. యస్. సి. ప్యాస్ అయి నేనూ చదువు మానేసి ఇంట్లోనే వ్యవసాయం పనులు చూసుకుంటున్నాను. పోతే సూరి ఒక్కడు సిటీలో యమ్. సి. ఇ. చదువుతున్నాడు.

* * *

ఓ రోజు హరి హడావిడిగా వచ్చి శుభలేఖ అందించాడు.

"అయితే పెళ్ళాన్ని కట్టుకుంటున్నావన్న మాట" శుభలేఖ తిరగేస్తూ అడిగేను.

"ఆఁ ఎప్పుడో ఒకప్పుడు పెళ్ళి చేసుకోవాల్సిందే గదా" అన్నాను.

"ఆః అన్నట్టు పెళ్ళికూతురు నాగావళి మీ మామయ్య కూతురే కదూ! మనకంటె రెండేళ్ళు జూనియర్"

'ఆఁ మనకంటే రెండేళ్ళు జూనియరే, కాని నాకంటె ఓ క్లాసు ఎక్కువే చదివింది. నాకు బయట బోలెడు పనుంది. పెళ్ళికి తప్పక రావాలిసుమా!" అంటూ గబగబా వెళ్ళిపోయాడు.

* * *

హరి పెళ్ళి బ్రహ్మాండంగా జరిగిపోయింది. పెళ్ళిలో సూరి ఎందుకో బాధ పడుతూన్నట్టు కనిపించాడు. అదే విషయం పెళ్ళిమరునాడు సూరి సిటీకి పోతున్నానని చెప్పిపోవడానికి వచ్చినప్పుడు సాగనంపుతూ "ఏరా సూరి! పెళ్ళిలో హుషారుగా ఉండాల్సింది దిగులుగా కన్పించావేమిటి" అని అడిగాను. (సూరికి నాకూ మధ్య రహస్యాలంటూ వుండేవికాదు ఏ విషయమైన ఇద్దరం ఒకరికొకరం చెప్పుకునేవారం) మౌనంగా కొంత దూరం నడిచాక చెప్తాను విను అని మొదలు పెట్టాడు.

"ఎందుకో నాగావళి అంటే నాకిష్టం ఇంకా చెప్పాలంటే నాగావళిని నేను ప్రేమించాను. మా మామయ్య కూడా ఎలాగూ నాకేఇచ్చి పెళ్ళి చేస్తాడనుకున్నాను"

"అయితే నాగావళి నిన్ను ప్రేమించిందా," నాగావళి ఉద్దేశ్యమేమిటో తెలుసుకోవాలని చెప్పుకు పోతున్నవాడికి అడ్డు ప్రశ్న వేశాను.

ఆ పూర్తిగా చెప్పనియ్' అంటూ తిరిగి మొదలు పెట్టాడు.

అయితే ఓ రోజు అనుకోకుండా హరి, నేను మామయ్య ఇంటికి వెళ్ళాం సాయంత్రం నేను, తాతయ్యా వరండాలో కూర్చుని కబురు చెప్పుకుంటున్నాం మామయ్య ఏవో పనిమీద బయటకు పోతూ నాగావళిని పిలిచి నాగావాళీ ఈ ఇద్దరి బావల్లో ఎవర్ని చేసుకుంటావే అని అడిగాడు. అనుకోకుండా వచ్చిన ప్రసంగానికి నేను కాస్త తడబడ్డా. ఒకందుకు మంచిదే ననిపించింది. నాగావళి ఏం చెపుతుందో వినాలనిపించింది. తాతయ్య మాటలు విన్నాడేమో చిన్నమామయ్య, (నాగావళి చిన్నాన్న) "అదేంటి నాన్నా! నాగావళిని హరికి ఇవ్వాలను కుంటున్నాం గదా! అన్నయ్యకూడా సరే నన్నాడు. ఇప్పుడు దాన్నడగ మేమిటి' అంటూ తన గదిలోంచి బయటకు వచ్చాడు నాగావళి వైపు 'ఇంట్లోకి వెళ్ళు' అన్నట్టు చూస్తూ. నాగావళికి మాట్లాడటానికి సమయమే చిక్కలేదు. ఇక అక్కడ వుండటం అప్రస్తుత మనుకొని నా వైపు ఒక్కసారి దీనంగా 'అసహాయురాలిని' అన్నట్టు చూసి గడ్డలో పీట్ను కుక్కుకొని వెళ్ళిపోయింది. ఆ ఒక్క చూపు చాలు, నాగావళి నన్ను ప్రేమించిం దనడానికి" చెపుతూంటే సూరి కంఠం బొంగురు పోయింది. కళ్ళల్లో నీరు నిండాయి.

"నీ తప్పే వుంది సూరీ! మీ నాన్నవాళ్ళతో మీ మామయ్యను అడిగించాల్సింది." అన్నాను ఓదారుస్తూ

"లాభం లేదు. మా చిన్న మామయ్య గుణం నాకు బాగా తెలుసు. ఆయన ఏది చేయాలనుకుంటే అది చేస్తాడు. మా పెద్ద మామయ్యకు కూడా బాగా నూరిపోశాడు. ఆయనకూడా వినే మూడ్‌లో లేడనిపించింది. అందుకే ఊరుకున్నాను" అన్నాడు.

మాటల్లోనే స్టేషన్ వచ్చింది. ట్రైన్ రెడీగా ఉండడం మూలాన గబగబా టిక్కెట్టుకొని సూరి కంపార్ట్‌మెంటులో ఎక్కి కూర్చున్నాడు. రైలు జనభారంలో నిండుగర్భిణిలా కదిలి వెళ్ళింది. ఆలోచనల్తో నేను ఇంటిముఖం పట్టాను.

* * *

కాలచక్రం ఎవరికోసం ఆగుతుంది. మూడేళ్ళు అవలీలగా గడచిపోయాయి. సూరి చదువు పూర్తి చేసి ఉద్యోగంలో చేరాడు. ఈ మూడేళ్ళల్లో జరిగిన

# నవతా - మానవతా

— జి. వెంకటస్వామి

ఘోషిస్తున్న హేతువాదం, వేకువలో
వ్యక్తిత్వం సూర్యుడు వెలుగులు వెదజల్లాలని
పాండిత్యాన్ని డిగ్రీల తప్పుడు రాళ్ళతో తూస్తున్న
పట్టాల అంగట్లో కొత్తరాళ్ళకు అవసరం కలిగిందని
ఆలోచనాలోచనాలు హృదయాన్ని ఆవిష్కరించాలని
పగిలిన కులమతాల అడుగోడలమీద
సమతా మయూఖాలు శోభావహంగా ప్రసరించాలని
సౌహార్ద మరీచులు స్వేచ్ఛగా విహరించాలని
గళ్ళల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నాను!
ముళ్ళడొంకల్లో పూలు పూయించే యత్నం చేస్తున్నాను!!

* * * *

నా రచియిస్తున్న నవ్యసమాజంలో
భావచైతన్యం పుష్పవృష్టి కురుస్తుంది;
అసమానత మబ్బుల్లో విప్లవం మెరుస్తుంది;
నెలలు నిండకుండా పురిటి నొప్పులు పడుతున్న
వర్తమానానికి శస్త్రచికిత్స జరిగి
భవిష్యత్ సుందరి ప్రభవిస్తుంది;
మానవతా ప్రాంగణంలో
నవత నాట్యం చేస్తుంది!

---

పెద్ద మార్పల్లా సూరికి వారి చిన్నమామయ్య కూతురు ఇందిరతో పెళ్ళి నిశ్చయమవ్వడం, జరగటం. కాని ఇందిర మనో భావాలకూ సూరి మనో భావాలకు చుక్కెదురు. అందని ఆకాశానికి నిచ్చెనలు వేయాలంటుంది ఇందిర. ఉన్నదాంట్లోనే సర్దుకు పోవాలంటాడు సూరి.

సూరి, ఇందిర పెళ్ళిమాత్రం ఘనంగా జరిగింది. పెళ్ళిలో నాగావళిని చూస్తే నాకు భయమేసింది. గుడ్డ పట్టనంతగా నీరసించి పోయింది. నాగావళి తండ్రికూడా అంత ఉత్సాహంగా కనిపించలేదు. అంటీ అంటనట్టు దూర దూరంగా తిరిగాడు. ఒంటరిగా చిక్కినప్పుడు అడిగాను. "ఏమిటి! నాగావళి అలా చిక్కిపోయిందని.

"ఏం చెప్పను బాబూ హరి యీ మధ్య చాలా మారిపోయాడు. పేకాడుతూ, తాగుతూ, తిరుగుతున్నాడు. దాని విషయం ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ఇంటిపట్టునకూడా సరిగ్గా ఉండడంలేదట. ఏదైనా మందలిస్తే కొడుతున్నాడట చూసి చూసి దాని మెడకు ఉరి త్రాడు బిగించినట్లైంది. సూరి కిచ్చినా బాగుండేదనిపిస్తుంది" అంటూ కంట తడిపెట్టాడు.

"మరి అప్పుడు నాగావళిని సూరి కెందుకివ్వనన్నారు?" అని అడిగాను.

"నేనూ నాగావళిని సూరికే యివ్వాలనుకున్నాను. కాని అప్పుడు తమ్ముని స్వార్థబుద్ధిని తెలుసుకోలేక పోయాను సూరివాళ్ళకి ఆస్తిలేదు ఏమి లేదు. రేపు చదువయ్యాక ఉద్యోగం దొరక్కపోతే ఎట్లా' అని చెప్పి నమ్మించాడు. అందుకు తగిన శిక్ష జరిగింది. ఎవరి అదృష్టం ఎలాఉందో" అంటూ తన నేరాన్ని అదృష్టం పైకి నెట్టివేశాడు.

* * *

ఆర్నెలలు గడచినయి. ఈమధ్య సూరి మా వూరికి నాలుగుమైళ్ళ దూరంలో ఉన్న తాలూకా హెడ్‌క్వార్టర్స్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. స్వగ్రామంలోనే మకాంపెట్టి రోజూ ఆఫీసుకు సైకిలుమీదనే వెళ్ళి వస్తున్నాడు. ఇద్దరం తరచూ రెండు మూడు రోజులకోమారైనా కలుస్తుంటాం

ఓరోజు సాయంత్రం సూరి గబగబా నన్ను పిల్చుకుంటూ ఇంట్లోకి వచ్చాడు. వాడి అవతారం చూస్తే ఎటువంటి వాడికైనా భయమేస్తుంది. రాత్రి పూర్తిగా నిద్రలేదేమో కళ్ళు ఎర్రగా మారి లోతుకు పీక్కుపోయినయ్. జుట్టంతా చిందర వందరగా పైకిలేచి ఉంది

"ఏరా! అలా ఉన్నావు ఏమైంది?' అనిఅడిగాను.

"నువ్వే మొదట బయటికి పద చెప్తా"నంటూ అలానే నిల్చున్నాడు. రెండు నిముషాల్లో నేను బట్టలు వేసుకున్నాను ఇద్దరం కలిసి బయటకు వచ్చాం. దారివెంబడి నడచివెళ్ళి మా రెండు గ్రామాల మధ్యన ఉన్న చెఱువు గట్టుమీద కూర్చున్నాం.

పది నిముషాలు గడిచాక "ఏరా సూరీ ఏం జరిగింది" అని అడిగాను. సమాధానంగా జేబులోంచి ఓ కాగితం నా చేతికిచ్చాడు నాకది కొత్తగా అనిపించింది విషయమేమిటోనన్న ఆతురతతో విప్పి చదువసాగాను అది నాగావళి సూరికివ్రాసిన ఉత్తరం.

"బావా!

ఇదేమిటి! నాగావళి నాకుఉత్తరంవ్రాస్తుందనిఆశ్చర్యపోతున్నావు కదూ! నేను కూడా అనుకోలేదు కాని ఈ పరిస్థితుల్లో నీకు వుత్తరం వ్రాయక తప్పడంలేదు అంతా దైవేచ్ఛ. మనం కేవలం దేవుని చేతుల్లో కీలుబొమ్మలం. ఎలా ఆడిస్తే అలా ఆడవల్సిందే.

హరి ఎలా మారిపోయాడో నీకు తెలుసు. కాని ఇంత అఘాయిత్యం మాత్రం చేస్తాడనుకోలేదు ఇంతటి నీచానికి ఎలా దిగజారి పోయాడో అర్థం కాకుండా వుంది. నా జీవితంలో నిప్పులు పోశాడు పో నేపోశాడు కాని నీ జీవితంలోకూడా పోస్తాడనుకోలేదు. ఇందిరను లేవదీసుకొని బొంబే వెళ్ళిపోతున్నట్టు చీటీ వ్రాసిపెట్టి వెళ్ళిపోయాడు. ఏం చేయాలో నా కర్థం కాలేదు వెంటనే మీ ఇంట్లోకి వెళ్ళి చూశాను. ఇందిర లేదు. సామానంతా చిందర వందరగా కన్పించింది. నా తల తిరిగిపోయింది. నా ముఖం తిరిగి నీకు చూపించాలనిపించలేదు. అందుకే నేనూ ఓ నిశ్చయానికి వచ్చాను, ఈ లోకం విడిచి ఎవ్వరికీ కనిపించని దూర తీరాలో విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాను. చివరి సారిగా నా ఒక్క కోర్కె తీర్చు బావా! విధి లేపిన గాలి దుమారానికి నీవు ఏ అఘాయిత్యానికీ పూనుకోకు అంతే నాకు కావలసింది.

ఎప్పటికీ సెలవు తీసుకుంటూ,

నీ మరదలు,

నాగావళి

ఉత్తరం నా కన్నీళ్ళతో తడిసి పోయింది. ఉత్తరం చదివిన నా పరిస్థితే ఇలా ఉంటే, సూరి పరిస్థితి చెప్పనవసరం లేదు చీకటి పడే వరకు అక్కడు కూర్చున్నాం వాణ్ని తీసుకొని ఇంటికి వస్తుంటే చెఱువు అవలి గట్టున ఏదో అల్లరి చెలరేగింది చాకలి వాళ్ళంతా గుమిగూడి వున్నారు. అటువైపునుండి వస్తున్న ఓ ముసలయ్యను "ఏం జరిగిందక్కడ" అని అడిగాను.

"ఆ! ఎవతో చెఱువులో పడి చచ్చింది" ప్రాణానికి విలువ లేనట్టు నిర్లక్ష్యంగా ఆ ముసలి వాడు గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

*